


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మేడిన్ హెవెన్

**"ఏ విషయమైనా** మనసులో ఒకటి ఉంచుకుని బయట ఒకటి మాట్లాడటం నాకిష్టం ఉండదు" మనోహరి అతని కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది.

శంతన్‌కి ఇలాంటి మాటలంటే చిరాకు. ఒక మాట బయటకి అనడంకన్నా మనసులో దాచడానికి చాలా కష్టపడాలి. కారణం సంస్కారం. సంస్కారంలేని మనుషులే ఇలా గొప్పలు చెప్పుకుంటారని అతనికి బాగా తెలుసు.

"మీకసలు ఫ్రెండ్స్ వున్నారా?" నవ్వుతూ అడిగాడు.

"ఎందుకుండరూ? 'మనో నువ్వు కల్లాకపటం లేనిదానివి' అని మెచ్చుకుంటారు."

"ఓ! వాళ్ళంతా కల్లాకపటం ఉన్నవారన్నమాట."

కోపంతో మనోహరి మొహం ఎర్రబడింది.

పెళ్ళిచూపుల ప్రహసనం నడుస్తోంది. ఈ కాలంలో కూడా పెళ్ళిచూపులేంటని నసిగినా తండ్రికి భయపడి వచ్చాడు శంతన్. ఎగతాళి చేస్తారని మిత్రులెవరికీ ఈ విషయం చెప్పలేదు.

మనోహరి అందంగానే ఉన్నా ఎందుకో అతనికి నచ్చలేదు. కొద్దిగా అతిశయం కనిపించిందా అమ్మాయిలో.

"మా అమ్మాయి బి.టెక్ చదివింది కాని ఉద్యోగం చేయడం ఇష్టంలేదు." ఆమె తండ్రి చెప్పాడు.

మనోహరి తలెత్తి గర్వంగా చూసి మళ్ళీ తలదించుకుంది.

మరి చదువుకోడం ఎందుకో! అందుకే గర్వించాల్సిందికూడా అతనికేం కనపడలేదు.

"విజ్ఞానం కోసమే చదువుకుంది" అతని సందేహ నివృత్తి చేసాడాయన.

మనోహరి తండ్రికేసి చూసి సైగ చేసింది. ఆయన అనవసరంగా నవ్వుతూ చెప్పాడు.

"అమ్మాయి, అబ్బాయి విడిగా మాట్లాడుకుంటే బాగుంటుందేమో. మనో! అబ్బాయిని పైకి తీసుకెళ్ళమ్మా"

మనోహరి సోఫాలోంచి చెంగున లేచి శంతన్ వంక చూసింది. చేసేది లేనట్లు అతను ఆమె వెనక నడిచాడు.

పైన బాల్కనీలో ఉన్న పేము ఉయ్యాల ఊగుతూ మనోహరి అతనివంక ఆసక్తిగా చూసింది. అతను అక్కడే ఉన్న ఓ ప్లాస్టిక్ కుర్చీలో కూర్చున్నాడు.

"మీ పేరు మరీ ఆడపిల్ల పేరులా ఉంది. నా పేరంటే నాకెంతో ఇష్టం" కళ్ళు మెరిపిస్తూ చెప్పింది.

శంతన్ ఏమీ మాట్లాడలేదు. ఆమె కొద్దిసేపు వేచివుండి మళ్ళీ తనే చెప్పింది.

"మా క్లాస్‌లో అంతా రమ్యలు, మౌనికలు, హారికలు. నా పేరే నాలుగక్షరాలు. నా పేరు వెనక ఒక కథ కూడా వుంది..." ఆగి అతను ఆసక్తిగా చూడడంతో చెప్పింది.

"మా నాన్న ఇంటర్మీడియట్ చదివేప్పుడు వాళ్ళ ఇంగ్లీష్ టీచర్ పేరు మనోహరిట. ఆయనకి ఆవిడంటే క్రష్‌ట" చివర్లో గొంతు తగ్గించింది.

శంతన్‌కి ఆయన గుర్తొచ్చాడు. తెల్ల పేంట్, షర్ట్‌లోని సన్నగా తెల్లగా ఉన్న మనిషి. పొడుగాటి మొహం, తెల్లటి కళ్ళ కొనరుల్లో ఎర్ర బార్డర్స్. వేంపైర్ పగటిరూపంలో ఉన్న ఆయనకి క్రష్, ఆ పేరు కూతురికి పెట్టుకునే అభిరుచి!

అతనికి నవ్వొచ్చింది. నవ్వితే బాగుండదని తల తిప్పి పూలకుండీలని చూడసాగాడు.

"మా అమ్మ ఊరుకుంది కానీ నేనైతేనా.. నా హస్బెండ్ నాకే సొంతం. మీరెవరినైనా ప్రేమించారా?" అడిగింది.

"లేదు. ప్రేమిస్తే పెళ్ళిచూపులకి రానుగా."

మనోహరి తృప్తిగా నవ్వింది.

"ఆ విషయంలో నేను చాలా పొసెసివ్. ముందే చెప్తున్నా."

శంతన్ కంగారు పడ్డాడు. ఈ అమ్మాయేమిటి? పెళ్ళి కుదిరిపోయినట్లే మాట్లాడుతోంది. అంతా తనిష్టమేనా?

"నేనేదైనా మొహమ్మీదే చెప్తా. మనసులో పెట్టుకోవడం నాకిష్టం ఉండదు.." మనోహరి మరోసారి చెప్పింది.

"ఏరా! ఏమంటావ్?" దార్లో అడిగాడు తండ్రి.

"నాకిష్టంలేదు. నాకు జాబ్ చేసే అమ్మాయి కావాలి.

"జాబ్ చేయకపోతే ఏంటి? చదువుకున్న పిల్ల. పైగా బోలెడు ఆస్తి, ఒక్కతే కూతురు..." తండ్రి అసంతృప్తిగా చెప్పాడు.

"జాబ్ చేయనప్పుడు బి.టెక్ ఎందుకు నాన్నా? టెన్త్ ఫెయిలైనా చాలు. ఆస్తి ఎప్పటికి వచ్చేను? ఆయనెప్పుడు ఛస్తాడా అని వెయిట్ చేయాలా? ఐనా ఇంట్లో వ్యాపకం లేకుండా ఉండేవాళ్ళు నాకొద్దు. బయట పనిచేస్తూ, కాస్త ఎక్స్‌పోజర్ ఉన్న అమ్మాయిని చూడు" శంతన్ ఖచ్చితంగా చెప్పాడు.

అంతదాకా ప్రపంచం చాలా చిన్నదైందని చదవడమేకానీ అనుభవంలోకి రాలేదు శంతన్‌కి. ఆ రోజు ఆ రిసెప్షన్‌లో మనోహరిని చూసాక అనుకున్నాడు. 'ప్రపంచం ఎంత చిన్నదైపోయింది!'

తన ఆఫీస్ కొలీగ్ గిరీష్ పక్కన జిగజిగా మెరుస్తున్న ఘాగ్రాలో మనోహరి కూడా మెరిసిపోతుంది. ఆమె తల్లితండ్రులు కూడా స్టేజ్ మీదే ఉన్నారు. శంతన్ పూలగుత్తితో స్టేజ్ పైకి వెళ్ళడానికి క్యూలో నిలబడ్డాడు. అతనిముందు వారి కొలీగ్ రీనా ఉంది. క్యూలో ఆమెతో మాట్లాడుతూ ముందుకి నడిచి స్టేజ్ ఎక్కాడు. రీనా తన చేతిలోని బొకే గిరీష్‌కి అందించి, అతనికి షేక్ హేండ్ ఇచ్చి, మనోహరికి హాయ్ చెప్పి, వారి పక్కన ఫోటో తీయించుకుని ముందుకి కదిలింది. అంతవరకు కొద్ది దూరంలో వేచి ఉన్న శంతన్ వారి

దగ్గరకి నడిచాడు. అతని దృష్టి గిరీష్ ఎడమ చేతిమీద పడింది. అది మనోహరి చేతిలో నలిగిపోతోంది. ఆమె గోళ్ళు అతని చేతిలో దిగబడుతున్నాయని అర్థమైంది.

"ముట్టుకోకుండా మాట్లాడలేవా?" అతన్ని కటువుగా అడుగుతోంది.

అప్రయత్నంగా శంతన్ కాళ్ళు వణికాయ్. గిరీష్‌కి బొకే ఇచ్చి స్టేజ్ దిగి వెళ్ళిపోయాడు.

భోజనాల హాల్‌లో ప్లేట్లో బిరియానీతో ఓ టేబుల్ ముందు కూర్చున్నాడు. ఐస్క్రీం కప్‌తో వచ్చిన మరో కొలీగ్ చరణ్ రెండో కుర్చీలో కూర్చుని చెప్పాడు.

"ప్రపంచం ఓ చిన్న విలేజైపోయింది బాస్."

"నువ్వుకూడా మనోహరిని పెళ్ళి చూపులు చూసావా?" శంతన్ అడిగాడు.

"నువ్వు కూడానా?" చరణ్ ఆశ్చర్యపోయాడు.

"వాళ్ళ నాన్న కేవలం మన కంపెనీ ఎంప్లాయిస్‌నే చూసినట్లున్నాడు." శంతన్ నవ్వాడు.

"నువ్వెందుకు రిజెక్ట్ చేసావ్ బ్రో?" చరణ్ అడిగాడు.

"జాబ్ చేయడం ఇష్టంలేదని చెప్పింది. పైగా కొంచెం అహంకారం కనిపించింది."

"జాబ్ చేసే సీన్ లేదు. బి.టెక్ ఫార్టీ పర్సెంట్‌తో పాసైంది. ఎవడిస్తాడు జాబ్? ఇష్టంలేదని కవరింగ్" చరణ్ చెప్పాడు.

"నీకెలా తెలుసు?"

"మా కజిన్ ఈవిడ క్లాస్‌మేట్. మనోహరి అని పేరు వినగానే చెప్పింది. 'వద్దు. ఆ అమ్మాయి కొంచెం తేడా' అని. వాళ్ళ కాలేజ్‌లో పెద్ద ఐటమ్‌ట. ఐనా ఇద్దరు ముగ్గురు అమ్మాయిలతో గ్రంథం నడిపిన గిరీష్ ఈవిడ్ని చేసుకున్నాడేంటో?"

"అయ్యో! గిరీష్‌గాడు ఇరుక్కుపోయాడు" ఆమె చేతిలో నలిగే గిరీష్ చేయి గుర్తొచ్చి శంతన్ బాధగా చెప్పాడు.

"అదేకదా? ఆ అమ్మాయి నాతో 'నేను పొసెసివ్. నా మొగుడు నాకే సొంతం'లాంటి డైలాగ్స్ చెప్పింది. అప్పుడే కుదరదనుకున్నా. ఆఫీస్‌లో ఎంతోమంది అమ్మాయిలుంటారు. మాట్లాడక తప్పదు. రోజూ ఎక్స్‌ప్లెనేషన్ ఇవ్వాలంటే నావల్లకాదు... కాని దేవుడు భలే చతురుడు బాస్. ఆడపిల్ల కనపడితే చాలు ఎగబడి చూసే గిరీష్‌గాడికి, ఈ మనోహరికి పెళ్ళి చేసి ఏం వినోదం చూస్తున్నాడో" చరణ్ ఐస్క్రీం కప్‌ని డస్ట్‌బిన్‌లో విసిరేస్తూ చెప్పాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments